

ఎరువుల విక్రయాలపై నజర్



యాప్‌లో ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

- కృత్రిమ కొరతకు అడ్డుకట్ట
- ఎరువుల నిల్వల నమోదుకు ప్రత్యేక యాప్
- వారానికి రెండురోజులు వ్యవసాయ అధికారుల తనిఖీలు
- జిల్లాలో యాసంగి ఎరువుల వినియోగం 41 వేల 32 మెట్రిక్ టన్నులు
- యాసంగి సాగు 1.76 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎరువుల విక్రయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఎరువుల కృతిమ కొరతకు అడ్డుకట్ట వేయనుంది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్ ద్వారా ఎరువుల నిల్వలను తెలుసుకోనుంది. ఏ దుకాణంలో ఎంత నిల్వ ఉంది అనే లెక్కలు పక్కాగా ఉంటున్నాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా కచ్చితమైన సమాచారం ఉండే విధంగా వ్యవసాయ అధికారులు ప్రణాళిక రూపొందించారు. వారంలో రెండు రోజులు జిల్లాలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 170 ఫర్టిలైజర్ డీలర్లు ఉన్నారు. 18 ఆగ్రోస్ కేంద్రాలు, 23 ప్యాక్స్ సొసైటీల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి ప్రస్తుతం యాసంగి సీజన్‌లో 41,032 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం అవసరమని అంచనా వేశారు. యూరియా 21,673, డీఏపీ 3338, కాంప్లెక్స్ ఎరువులు 11,444, ఎంవోపీ 4575 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు ఉపయోగిస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. గతంలో ఎరువుల విక్రయాల్లో కృతిమ కొరతతో రైతులు ఇబ్బందులు పడేవారు. పంపిణీలో అనేక పక్కదారులు పట్టేవి. అక్రమంగా నిల్వలు చేసి అధిక ధరలకు విక్రయించిన సందర్భాలు ఉన్నాయి. వీటిని అడ్డుకట్ట వేసే దిశగా వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఏ డీలర్ వద్ద ఎరువులు నిల్వ ఉన్నాయి. ఏ రోజు ఎంత విక్రయించారు. ఎవరికి విక్రయించారనే వివరాలు నమోదు అవుతాయి. దీంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువులు లభించే అవకాశం ఉంది.

జిల్లాలో 1.76 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులు యాసంగిలో లక్షా 76 వేల 653 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి లక్షా 73వేల 742 ఎకరాల్లో సాగు చేయగా మొక్కజొన్న 1302.29 ఎకరాలు, జొన్న 2.12 ఎకరాలు, శెనగలు 207.31 ఎకరాలు, అముదం 6.02 ఎకరాలు, బబ్బెర్లు 25.05 ఎకరాలు, ఎర్రజొన్నలు 67.08 ఎకరాలు, పెసర్లు 63.02 ఎకరాలు, పల్లి 23.23 ఎకరాలు, ఉలువలు 3.35 ఎకరాలు, అవాలు 13.35 ఎకరాలు, పారా గ్రాస్ 10.18 ఎకరాలు, నువ్వులు 242.19 ఎకరాలు, పొద్దు తిరుగుడు 800 ఎకరాలు, పొగాకు 2 ఎకరాలు, గోధుమలు 101 ఎకరాలు, చెరకు 18 ఎకరాలు, ఇతరపంటలు సాగుచేశారు.

చుక్కల మందుకు సర్వం సిద్ధం

- ఐదేళ్లలోపు పిల్లలు 44,770 మంది
- రేపు పల్స్‌పోలియో



పోలియో చుక్కల ప్రచార పోస్టర్

సిరిసిల్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన పాప నుంచి ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా పోలియో రహిత సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలో పల్స్‌పోలియో చుక్కల పంపిణీకి వైద్యశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచారు. జిల్లాలో 44,770 మంది ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు అందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 394 కేంద్రాల్లో పోలియో చుక్కలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో రెండు ఏరియా ఆస్పత్రులు, 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 89 సబ్ సెంటర్ల ఆధ్వర్యంలో పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలు సిద్ధం చేశారు. ఆదివారం పట్టణాలు, గ్రామాల్లోని ప్రధానమైన ప్రాంతాల్లో పోలియో చుక్కల పంపిణీ చేయనున్నారు. 25 మొబైల్ టీంలు ఏర్పాటు చేశారు. మిగిలిపోయిన వారికి 4, 5 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా తల్లిదండ్రులు పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. అందుబాటులో ఉన్న పోలియో చుక్కల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

త్వరలో వేములవాడకు సీఎం రేవంత్ రెడ్డి

వేములవాడ, మార్చి 1 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో వేములవాడలో పర్యటించనున్నారు. రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో వేములవాడకు రానున్నట్లు స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ కార్యకర్తలతో చెప్పినట్లు సమాచారం. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి, వీటీడీఏ కార్యకలాపాలు, స్థానిక ఇతర అంశాలపై ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తరుణంలో సీఎం వేములవాడను సందర్శించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూలు రెండు మూ డు రోజుల్లో ఖరారయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

నువ్వులు, వరి సాగుపై అవగాహన

రుద్రంగి, మార్చి 1:రుద్రంగి మండలం మానాలలోని రైతులకు నువ్వుల పంట, వరి సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానాలలోని వరి, నువ్వుల పంటలను ఏఈవో విజయ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు సోకే ప్రభావం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నువ్వుల పంటలో మొగ్గ ఏర్పడే దశలో పంటను పురుగులు తింటాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, రమేష్, శంకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ



ప్రారంభిస్తున్న జడ్పీటీసీ గుండం నర్సయ్య

ముస్తాబాద్, మార్చి 1: ముస్తాబాద్ మండలంలోని గూడెం, ఆవునూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు జడ్పీటీసీ గుండం నర్సయ్య శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ రూ.12లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, మాజీ సర్పంచ్‌లు బద్ది కళ్యాణిభాను, చిట్నేని సరిత శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ సొల్ల లలిత, సొల్ల క్రాంతి, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, మల్లారెడ్డి, వేణు, పోచిరెడ్డి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఎంపీటీసీ రాజీనామా

వేములవాడ టౌన్, మార్చి 1: వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు రాజీనామా లేఖ పంపినట్లు తెలిపారు.

ధర్మారంలో పశు వైద్య శిబిరం

కోనరావుపేట, మార్చి 1: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో పశు వైద్యాధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈనెల చివరి వరకు ప్రతిరోజు ప్రతీ గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాజన్న భక్తులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మహాశివరాత్రి జాతరకు వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా వచ్చే భక్తులకు వైద్య శిబిరాల ఏర్పాటుపై జిల్లా వైద్య సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ వేములవాడలో దేవస్థానం ఈవో కాంప్లెక్స్, అమ్మవారి కాంప్లెక్స్, శివశరణం, గుడి మైదానం, లడ్డూ కౌంటర్ ప్రధాన భాగాలుగా విభజించి క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. వీటితోపాటు కోరుట్ల, జగిత్యాల, తిప్పాపూర్, నాంపల్లి బస్టాండ్‌లలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశామని అత్యవసర సర్వీసులు, అంబులెన్స్, దేవాలయంలో రెస్క్యూ బృందం, ధర్మగుండ దగ్గర క్లోరినేషన్, క్విక్ రెస్పాన్స్ బృందాలు 5వ తేదీ నుంచే పనులు చేస్తాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ నయూమా, దేవస్థానం ఇన్‌చార్జి, క్యాంపు అధికారులు డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ దివ్య, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, మార్చి 1: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరిపాలన సౌలభ్యం కోసం నూతనంగా నిర్మించిన ఎస్సైల గదిని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా నడుచుకోవడమే కాకుండా ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు కరుణాకర్, శ్రీనివాస్, కమ్యూనికేషన్స్ సీఐ శ్రీలత తదితరులు ఉన్నారు.

మారుమూల ప్రాంతాలకు నిరంతరం పోలీసు సేవలు

వేములవాడ టౌన్: పోలీస్ శాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు నిరంతరం సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి గుట్టపైన ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ రిపిటర్ రూమ్‌ను ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు నాంపల్లి గుట్టపైన కమ్యూనికేషన్ రిపిటర్ రూమ్‌నే ఏర్పాటు చేశామన్నారు. దీంతో పోలీస్ సిబ్బంది ఏ ప్రాంతంలో ఉన్నా మట్లాడే వెసులు బాటు ఉంటుందన్నారు.

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ఎస్పీ

నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామిని ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి అర్చకులు రామాచారి, విజయేంద్రచారి స్వాగతం పలికారు. ఆలయ మండపంలో ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ తదితరులు ఉన్నారు.



ఎస్పీకి ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

కాంగ్రెస్ పాలనలోనే గ్రామీణ రోడ్ల అభివృద్ధి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, మార్చి 1: కాంగ్రెస్ పాలనలోనే గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధి చెందాయని, తిరిగి ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలం తడగొండ, బోయినపల్లి, స్తంబంపల్లి, గుండన్నపల్లి, బూర్గుపల్లి, కోరెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని సైతం ప్రభుత్వం త్వరితగతిన అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ప్రజలు నమ్మవద్దని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, తహసీల్దార్ పుష్పలత, సింగిల్ విండో చైర్మన్లు దుర్గారెడ్డి, కిషన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు కూన రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎనుగులు కనకయ్య, కార్యదర్శి కట్ట లచ్చయ్య, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షువు వన్నెల రమణారెడ్డి, నాయకులు నాగుల వంశీ, నిమ్మ వినోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు షీటీం అండ

ఇల్లంతకుంట, మార్చి 1: మహిళలకు షీటీం అండగా ఉంటుందని మహిళా ఏఎస్సై ప్రమీల అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థునులు ర్యాగింగ్‌కు గురయితే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్‌శాఖ అన్నివిధాలైన చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థినులు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఐరెడ్డి ప్రదీప్‌రెడ్డి, పీసీలు ప్రియాంక, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

ఇల్లంతకుంట, మార్చి 1: రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడోద్దని రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి మమత సూచించారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని రైతువేదికలో శుక్రవారం చీడపీడల నివారణపై అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ వరిలో వచ్చే మొగిపురుగు నివారణకు హైడ్రోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు, తెగుళ్ళ ఉధృతి పెరిగితే జింక్‌లోపం ఏర్పడుతుందని, దీని నివారణకు జింక్‌సల్ఫేట్‌ను వినియోగించాలన్నారు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అగ్గితెగులు వచ్చే అవకాశం ఉన్నందున వ్యవసాయశాఖ సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేష్, ఏఈఓ జ్యోతిలతో పాటు రైతులు పాల్గొన్నారు..

టీ-నేతన్న యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 1 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన టీ-నేతన్న యాప్‌లో మరమగ్గాల పరిశ్రమల ఆసాములు, కార్మికులతోపాటు అనుబంధరంగాల కార్మికులందరు ఈనెల 10వ తేదీలోగా వివరాలునమోదు చేసుకోవాలని సిరిసిల్ల చేనేత జౌళి శాఖ ఏడీ మిట్టకోల సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సిరిసిల్ల ప్రాంతంలో మరమగ్గాల పరిశ్రమలల్లో పని చేసే ఆసాములు, కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు జియో ట్యాగింగ్ కలిగి వృత్తిపై ఆధారపడిన ఆసాములు, అనుబంధ కార్మికులు ఈ యాప్‌లో నమోదవడం ద్వారా ప్రభుత్వ పథకాలలో ఏదైనా సమస్యలున్నా, అందకపోయినా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. పథకాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా మెసేజ్‌లు వస్తాయన్నారు. మరమగ్గాల ఆసాములు, కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సిరిసిల్ల రూరల్, మార్చి 1: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 154 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదు. వీరిలో జనరల్ విభాగంలో 3858 మంది విద్యార్థులకు 3704 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో451మంది విద్యార్థులకు421 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి మోహన్ పరిశీలించారు.

సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సైగా సాయికిరణ్

సిరిసిల్ల క్రైం, మార్చి 1: సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సైగా సాయికిరణ్‌ను నియమిస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్లలో పనిచేస్తున్న రాజును వేములవాడ ట్రాఫిక్ ఎస్సైగా బదిలీచేశారు. వేములవాడ ట్రాఫిక్ ఎస్సై దిలీప్‌ను ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీచేశారు.

గురుకుల అతిథి అధ్యాపకులకు ప్రభుత్వ ఉద్యోగాలు

వేములవాడ, మార్చి 1: వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. కామర్స్ విభాగం నుంచి మమత (జేఎం, డీఎల్, జేఎల్, పీజీటీ), లక్ష్మి(జేఎల్, పీజీటీ), జూవ్వాలజీ విభాగం నుంచి ప్రజ్ఞ (డీఎల్, జెఎల్), దీప (జేఎల్), సౌజన్య (జేఎల్) ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అధ్యాపకులను అభినందించారు.

ఎంపీడీవో, వార్డు కార్యాలయాల్లో ప్రజాపాలన కేంద్రాలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ఎంపీడీవో, మున్సిపల్‌లోని ప్రతీ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పబ్లిక్ పరీక్షలకు కట్టుదిటంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవి గుప్తాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి పరీక్షలు ఉంటాయని, ఇందు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల లోపలికి సెల్ ఫోన్ తీసుకెళ్లేందుకు వీలులేదని, గత అనుభవాలను దృష్ట్యా పరీక్షలు సజావుగా నిర్వహించాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘించి లీకేజీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. విధుల నుంచి తొలగిస్తామని, క్రిమినల్ కేసులు నమోదవుతాయని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్లలో బస్సు సర్వీసులు నడపాలన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, చిన్న పొరపాటు కూడా జరగకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం మరో 2 గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌సరఫరా పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఇందుకోసం లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అర్హులకు ఆరు గ్యారెంటీలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదేవిధంగా మున్సిపాలిటీలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నంబరు, విద్యుత్ మీటర్ నంబరు ప్రజా పాలన దరఖాస్తుల్లో సమర్పించిన వారందరికీ పథకాలు అందుతాయన్నారు. ఇప్పటివరకు ప్రజాపాలన దరఖాస్తులు సమర్పించని వారు ప్రజా పాలన సేవా కేంద్రాలలో వివరాలు అప్‌డేట్ చేసుకుంటే లబ్ధి పొందవచ్చన్నారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన మేర డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలన్నారు. ప్రతీ ప్రజాసేవ కేంద్రంలో అవసరమైన కంప్యూటర్లు ప్రింటర్ తదితర సామగ్రి సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో ఉమారాణి, డీఐఈవో మోహన్, డీఈవో రమేష్ కుమార్, డీపీవో వీర బుచ్చయ్య, డీసీఎస్‌వో జితేందర్ రెడ్డి, సెస్ ఎండీ సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 1: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫో ర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం భగత్‌నగర్‌లో నిర్వహించిన దాడుల్లో 535 గ్రాముల గంజాయి పట్టుబడింది. గంజాయిని కలిగి ఉన్న ముగ్గురు నిందితులు శాంతినగర్‌కు చెందిన ఆర్ శశికుమార్, పెగడపల్లికి చెందిన పి రామకృష్ణ, వరంగల్‌కు చెందిన బి జయంత్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేవామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుబడి నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు రెండు మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో అనుమానితులుగా ఉన్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించగా వారిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం

గణేశ్‌నగర్, మార్చి 1: తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం శుక్రవారం హైదరాబాదులో ఏర్పాటైంది. అధ్యక్షుడిగా బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీధర్ రావు, పరమేష్, ఉపాధ్యక్షులుగా నారాయణ గౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షులు ప్రకాష్, గింజల రమణారెడ్డి, సుందర్ రాజ్, కార్యదర్శులు హరిస్మరణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ యాదా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి గాయత్రి కళాశాల కరస్పాండెంట్ యెల్లెంకి శ్రీనివాస్, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో చెరుకు పంట దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మార్చి 1 : మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన నల్ల విఠల్ అను చెరుకు రైతు పంట గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం లోని నల్ల వెంకటేశ్వర్లు చెరుకు పంట వద్ద పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో చెరుకు పంటలో ఎగిసిపడుతున్న మంటలను గమనించిన స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అగ్ని మా పక సిబ్బందికి సమాచారం అందించి తోట వద్దకు వెళ్లాడు. మంటలను స్థానిక రైతులతో కలిసి ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి పంట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ. 2లక్షలు ఆస్థి నష్టం వాట్లిందని వెంకటేశ్వర్లు అవేదనతో తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఎవరైనా అనుమాణితులు ఉంటే తెలపాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిందా ? ఎవరైనా కావాలని చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- గన్నేరువరంవాసి మృతి

నార్సింగ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్ గుట్టపై మూవీ టవర్స్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కరీంనగర్ జిల్లా గన్నేవరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం కోకాపేట్‌కు రాగా రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, మార్చి 1: కరీంనగర్- జగిత్యాల మార్గం లోని రాజారం సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలతో ఒకరు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన తెట్టు ఎల్లయ్య(47) జగిత్యాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత

- దిగువ గోదావరిలోకి 0.6 టీఎంసీల నీటి విడుదల
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు


బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పొరుగున మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శుక్రవారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల నిమిత్తం ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేది నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు. అదే విధంగా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి మార్చి 1వ తేదీన ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు 5 గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

7న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం


మాట్లాడుతున్న బీసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి వైద్యుల అంజన్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి 1: బీసీ కుల గణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి ప్రభాకర్‌కు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే అభినందన సభ, ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వైద్యుల అంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఫిబ్రవరి 27న బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో బీసీ కుల గణన తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. కృతజ్ఞతగా బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఈనెల 7వ తేదీన గురువారం కరీంనగర్‌లోని ఇంద్ర గార్డెన్స్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బీసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, బీసీ సంఘాల, కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో లైవ్ సర్జరీలు


జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న వైద్యులు

సుభాష్‌నగర్, మార్చి 1: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో శుక్రవారం లైవ్ సర్జరీలను నిర్వహించారు. నగరంలోని రెనే ఆసుపత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ మానస్ పాణిగ్రహి పాల్గొని అత్యాధునిక వైద్య విధానంతో మెదడులోని కంతిని తొలగించారని సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. లైవ్‌లో వివరిస్తూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. ఈనెల 2న నగరంలోని వి కన్వెన్షన్‌లో సాయంత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సంతానసాఫల్య కేంద్రం డాక్టర్‌పై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మార్చి 1: సంతానం కోసం వైద్య చికిత్సలు పొందేందుకు ఒక మహిళ కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం ఆసుపత్రికి వెళితే డబ్బులు తీసుకుని చికిత్స అందించకుండా బెదిరించారని వచ్చిన ఫిర్యాదుతో డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజతోపాటు ఆసుపత్రి సిబ్బందిపై కేసు నమోదు చేశామని రెండో టౌన్ సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తిరుమణి నాగలక్ష్మి అనే మహిళ సంతానం లేకపోవటంతో కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం ఆసుపత్రిలో సంప్రదించింది. సంతానం కలిగేందుకు చికిత్సకోసం డాక్టర్ పద్మజ, ఆసుపత్రి సిబ్బంది కలిసి ఆమె వద్ద ఐదు లక్షల రూపాయలు తీసుకున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చికిత్స అందించకుండానే మరో 80 వేల రూపాయలు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది అడిగారని, చికిత్స చేయకుండా మళ్లీ డబ్బులు ఎలా ఇస్తామని అడగగా డాక్టర్‌తోపాటు సిబ్బంది తనను, తన భర్తను దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆసుపత్రిలో బంధించి, చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ పద్మజ, సిబ్బందిపై కేసు నమోదు చేవామని సీఐ ఓ వెంకటేష్ తెలిపారు.

మార్టిగేజ్ చేసిన భూమి మరొకరికి విక్రయం

- మోసగించిన దంపతుల అరెస్టు - 14 రోజుల పాటు రిమాండ్


నిందితులను జైలుకు తరలిస్తున్న ఎస్సై

కరీంనగర్ క్రైం/గంగాధర, మార్చి 1: భూమిని మార్టిగేజ్ చేసి మరొకరికి విక్రయించిన దంపతులపై కేసు నమోదైంది. ఒక వ్యాపారి నుంచి 56 లక్షల రూపాయల డబ్బులు అప్పుగా తీసుకుని, హామీగా 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మార్టిగేజ్ చేశారు. దంపతులు తిరిగి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి మరొకరికి విక్రయించారు. ఈ మేరకు దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గంధీరోడ్‌కు చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి అనే వ్యాపారి వద్ద నుంచి గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన మూల కనకయ్య 2016లో 30 లక్షల రూపాయలు, 2017లో మరో 26 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హామీగా మూల కనకయ్య, అతని భార్య మూల మంజుల పేరిట ఉప్పర మల్యాలలో ఉన్న 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేశారు. రెండు బ్యాంక్ చెక్‌లను కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని దాచిపెట్టి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి ఇతర వ్యక్తులకు విక్రయించారని బాధితుడికి తెలిసి వారిని నిలదీశారు. దీంతో చంపుతానని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి, విచారణ జరిపిన గంగాధర పోలీసులు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు నిజమేనని వెల్లడైంది. దీంతో దంపతులను శుక్రవారం అరెస్టు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారని, కరీంనగర్ జిల్లా జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

అద్దకం కార్మికుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 1: సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నాగుల శ్రీకాంత్(36) అనే అద్దకం కార్మికుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.... సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ అద్దకం కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాంత్, లావణ్య దంపతులకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. అతడికి భార్య లావణ్య, కుమారుడు, కూతురులు ఉన్నారు. భార్య, భర్తలిద్దరు ఇంట్లోనే ఉన్నారు. భార్య ఇంట్లో ముందు గదిలో బీడీలు చేస్తుండగా శ్రీకాంత్ బెడ్‌రూంలోకి వెళ్లాడని, ఏదో చప్పుడు వినిపించడంతో వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉన్నట్లు చూసి వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని భార్య లావణ్య చెబుతోంది. అప్పటికే శ్రీకాంత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య, భర్తల మధ్య తరుచూ గొడవలుజరగుతున్నాయని, మద్యానికి బానిసైన శ్రీకాంత్ మృతిపై అనుమానాలు ఉన్నాయని శ్రీకాంత్ తల్లి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య

కొడిమ్యాల, మార్చి 1: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కోల జమున(22)పెళ్లి ఇష్టం లేక శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు వివాహం చేయటానికి తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం చేసుకోవటం ఇష్టం లేక జీవితంపై విసిగి పోయి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఆమెను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి కోల భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

4న ఉమ్మడి జిల్లా జూనియర్స్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 1: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లాలోని కొత్తపల్లి మండల పరిధిలోగల అకాడమి హైట్స్ పబ్లిక్ పాఠశాల మైదానంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు 01-01-2004 తరువాత జన్మించిన వారు సంబంధిత జనన ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో పీఈటీ శ్రీధర్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

11న జేఎల్ఎం సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, మార్చి 1: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ఆరో విడత జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను 11న సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి యొక్క చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. జాబితాను నోటీసు బోర్డులో కూడా ఉంచామన్నారు. కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్ లెటర్‌ను పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, స్తంభం ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దని కోరారు.

49మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 1: జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 49 మంది మందుబాబులకు జరిమానా విధిస్తూ శుక్రవారం సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మందుబాబులను కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ 8 మందికి రూ.2 వేల జరిమానా, 25 మందికి రూ.1000 జరిమానా విధించారని ఎస్సై రమాకాంత్ తెలిపారు. అదేవిధంగా కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 20 రోజుల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని కోర్టులో హాజరుపరచగా తొమ్మిది మందికి రూ .2 వేలు, ఏడుగురికి రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

మూడు ద్విచక్రవానాలు దహనం


కాలిపోయిన వాహనాలు

తంగళ్లపల్లి, మార్చి 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో దహనమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున గుగ్గిళ్ల అంజనేయులు ఇంటి ముందు మూడు ద్విచక్రవాహనాలు పార్క్ చేశారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంల రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయి ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. ఇంటి ముందు రేకులు, షెట్టర్, వీవోపీకి సైతం పెట్రోల్ చల్లడంతో మంటలు చేలరేగి కాలిపోయాయి. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు గడ్డం సాయికృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, మార్చి 1: మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన పలికొండ నవీన్ (31) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ తనకు పిల్లలు పుట్టడంలేదని కొంత కాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. నవీన్ తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- రేవంత్‌కు, కేటీఆర్‌కు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా?
- కేటీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి పోటీ చేయాలి
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, మార్చి 1: ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్ సీఎం రేవంత్‌ను పదవికి రాజీనామా చేసి పార్లమెంట్ బరిలో నిలవాలని సవాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. కేటీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. విమర్శించే ముందు ఆత్మవిమర్శ చేసుకొని మాట్లాడాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరిస్థితి అధ్వానంగా మారిందని, కేటీఆర్ తీరుతో ఆఖరికి గెలుస్తదనే నమ్మకంతో ఉన్న మెదక్ సీటుకూడా గెలిచే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లలో పోటీ చేసి గెలవాలని జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. తుమ్మిడి హెట్టి వద్ద 160టీఎంసీల నీరు లభ్యత ఉందని నివేదిక ఉండగా, అక్కడి నుంచి ప్రాజెక్టు నిర్మాణంను కిందికి దించేందుకు మరో నివేదికను తయారుచేశారన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్ట్‌తో ప్రాజెక్టుకు నీరు చేరేదన్నారు. మేడిగడ్డ పిల్లరు కుంగడం టెక్నికల్ లోపమని సమర్థించుకోవడం విచారకరం అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అందవని ప్రచారం చేశారని, ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చారని దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. కానీ ప్రజా ఆశీర్వాదంతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను దశల వారీగ అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన తొలి గ్యారంటీ ఉచిత బస్సు సౌకర్యం నూటికి నూరు శాతం విజయవంతం అయ్యిందని, గృహవినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును కూడా మార్చి ఒకటి నుంచి అమలు చేసిందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకోని, రేషన్‌కార్డు కలిగిన వారు స్థానిక మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.500కే సిలిండర్ కార్యక్రమం అమలుతో పాటు, గృహ నిర్మాణం పథకం కూడా వారం రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు. ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటించేలా చర్యలు గైకొంటామన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఇప్పటికైనా కేటీఆర్ స్థాయికి తగిన విధంగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కొత్తమోహన్, గాజుల రాజేందర్, సిరాజుద్దీన్ మన్సూర్, షేక్ చాంద్‌పాషా, జున్ను రాజేందర్, బీరం రాజేష్, మహిపాల్, బొల్లి శేఖర్ తదితరులున్నారు.

● కాంగ్రెస్‌లో చేరికలు

జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చెక్కపెల్లి మోహన్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే సారంగాపూర్ మండలం పోచంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ పల్లికొండ రమేష్‌తో పాటు పలువురు గంగపుత్ర సంఘ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా వీరికి కాంగ్రెస్ కండువా కప్పిన జీవన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 1: మండలంలోని బండ లింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో పుణ్యాహవచనం గతస్థాపితార్చన, యంత్రమూర్తుల ప్రతిష్ఠాపన, నిత్యహోమం, జయాది హో మం, ప్రాయశిత్తహోమం, బలిహరణ, పూర్ణాహుతి, కుంభాషేకం ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను పురోహితులు ఘనంగా జరిపారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల వారి కల్యాణం అంగరంగ వైభవంగా జ రిపించారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదిత రులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

తిమ్మాపూర్, మార్చి1: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం ఉదయం మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనకాల నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో బెలున్స్ తెరచుకోవడంతో అందులో ఉన్న వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడాడు. కారులో మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన రాజేందర్ అనే వ్యక్తి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

ట్రాలీ ఆటో బోల్తా.. ఒకిరికి గాయాలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 1: సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వస్తున్న ఆటో పదిర సమీపంలోని వంతెన ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి ఆటో బోల్తా కొట్టింది. ట్రాలీ ఆటోలో తన కుమారుడితో ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న నారాయణాపూర్ గ్రామానికి చెందిన మోతే దేవదాస్ గుంతలో పడి ఆటో బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు డ్రైవర్ పైఉన్న ఆటోను పక్కకు జరిపి 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి 1: మండలంలోని చల్లూరు గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మానకొండూరు మండ లం ఊటూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కనుకుంట్ల శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

సీజ్ చేసిన వాహనాలు వేలం వేస్తాం

- ప్రభుత్వానికి ఆదాయం కల్పించడమే ధ్యేయం
- డీటీసీ పెద్దింటి పురుషోత్తం


వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న డీటీసీ పెద్దింటి పురుషోత్తం

తిమ్మాపూర్, మార్చి1: రవాణా శాఖ కార్యాలయంలో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కమిషనర్ పెద్దింటి పురుషోత్తం అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న డ్రైవింగ్ ట్రాక్ సమీపంలో ఉన్న పాడుబడ్డ వాహనాలను, వాహనాలను ఫిటెనెస్, రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును డీటీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా సీజ్ చేసిన వాహనాల జాబితా తయారు చేసి వారం రోజుల్లోగా తనకు అందజేయాలని ఏఎంవీఐ స్రవంతిని ఆదేశించారు. కార్యాలయానికి ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భారీ వాహనాలు, ఆటోలకు నాణ్యమైనా రేడియం స్టిక్కర్లను ముందు, వెనుకాల కచ్చితంగా వేయించాలని వాహనదారులకు సూచించారు. స్టిక్కర్లు వేసుకోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. నిర్మాణం పూర్తయిన డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డ్రైవింగ్ ట్రాక్ కు సంబంధించిన పెండింగ్ పనులపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి నిధులు సమకూర్చాలని కోరామని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిచేత ఈ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతామని డీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, సిబ్బంది శ్రీనివాస్, రహూఫ్, గౌస్ పాష తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు

- చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- మూడు రోజుల పాటు నిర్వహణ


సిద్ధం చేస్తున్న పందిళ్లు

వేములవాడ, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 7వ తేదీ నుంచి మార్చి 9 వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం ఆలయ అధికారులు భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు, వసతి గదుల కాంప్లెక్స్‌లకు కొత్తగా రంగులు వేయడంతో పాటు క్యూలైన్ల క్రమబద్ధీకరణ, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్లు, కలకత్తా పందిళ్ల ఏర్పాటు, శివార్చన వేదిక నిర్మాణం, తాత్కాలిక పార్కింగ్ లాట్స్ ఏర్పాటు, యాత్రికులకు తాగునీటి వసతి కోసం నల్లాల ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జాతర ప్రారంభం లోగా ఏర్పాట్లు పూర్తి చేస్తామని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆలయ అధికారులు తెలిపారు.


రోడ్డు చదును చేస్తున్న సిబ్బంది

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 1: భూ కబ్జాలకు పాల్పడిన పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ అర్బన్ పరిధిలోని తెట్టెకుంట పరిధిలో సర్వే నంబరు 6 లో గల 126 చదరపు గజాల స్థలాన్ని నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి, తనను బెదిరించి ఆక్రమించేందుకు ప్రయత్నం చాడని బాధితుడు కరీంనగర్‌కు చెందిన బెంజిమెన్ ఫిర్యాదు మేరకు. కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, మార్చి 1: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో రవాణాకు సిద్ధంగా ఉన్న రెండు వ్యాన్‌లలో లోడ్ చేయబడి ఉన్న సబ్సిడీ బియ్యంకు సంబంధించిన సమాచారాన్ని అందుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించి దేవునిపల్లి గ్రామానికి చెందిన వారణాసి సమ్మయ్య ను అదుపులోకి తీసుకుని రెండు వ్యాన్లలో ఉన్న బియ్యంతో పాటు సుల్తానాబాద్ పోలీసులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

ప్రతీ హామీని నెరవేరుస్తాం


బహుకరిస్తున్న సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశం

వేములవాడ, మార్చి 1 : శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శుక్రవారం వివిధ కుల సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని, కుల సంఘ భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలలో తన గెలుపు కోసం అందరూ కష్టపడి పని చేశారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీను నెరవేర్చే క్రమంలో నిధులను అందజేస్తున్నామని తెలిపారు. మీలో ఒకడిగా మీకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ బింగి మహేష్, నాయకులు పల్కం రాజు, చిలక రమేష్, అన్నారం శ్రీనివాస్, పులి రాంబాబు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం


ఫాజుల్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, మార్చి 1: జిల్లా పోలీసు శాఖ మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఫాజుల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాలతో ఎంతో ఉపయోగం ఉందన్నారు. గ్రామంలో భద్రత పటిష్టమవుతుందన్నారు. సీసీ కెమెరాల ద్వారా చాల కేసులు ఛేదించినట్లు చెప్పారు. సీసీ కెమెరాలను గ్రామానికి అందించిన దాతలను అభినందించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపవద్దన్నారు. మహిళలకు ఏదైనా సమస్య ఎదురై పోలీస్ స్టేషన్ రాలేకపోతే సఖి సెంటర్, షీటీమ్‌లను సంప్రదించాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి పాల్గొన్నారు.

తెలంగాణ గురుకుల పరీక్ష ఫలితాల్లో రెండో ర్యాంక్

సిరిసిల్ల టౌన్, మార్చి 1: తెలంగాణ గురుకుల పరీక్షల ఫలితాలలో సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఆర్‌కైలాసం రాష్ట్ర స్థాయిలోనే రెండో ర్యాంక్ సాధించగా శుక్రవారం సిరిసిల్ల పురప్రముఖులు అభినందనలు తెలిపారు. అదే విధంగా తెలంగాణ గురుకుల కళాశాల పరీక్షలో సిరిసిల్ల పట్టణం పెద్దబోనాలకు చెందిన యగేందర్ రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంక్, రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలో మొదటి ర్యాంక్ సాధించాడు.

సమ్మర్‌యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి

తంగళ్లపల్లి, మార్చి 1:సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని డీపీవో వీరబుచ్చయ్య ఆదేశించారు. శుక్రవారం తంగళపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ విశ్వకర్మయోజన పథకం, డీసీబీ, తదితర పథకాలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీవో అరీఫ్, ఏఈ సుమన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

వీర్నపల్లి, మార్చి 1: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఉపేందర్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత కష్టపడి సంపాదించిన వాటికి విలువను, గుర్తింపును తీసుకొస్తుందన్నారు. భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ శ్రావణ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ రవివర్మ, ఐకేపీ సీఏలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు న్యాయం

ఇల్లంతకుంట, మార్చి 1: నిరుద్యోగులకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుందని విమర్శించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో యువకులు కాంగ్రెస్‌పార్టీకి అండగా నిలవబోతున్నారని పేర్కొన్నారు..

పెద్దూర్ శ్రీకృష్ణ యాదవ సంఘం కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, మార్చి 1 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శ్రీకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగుల మల్లయ్యయాదవ్, ఉపాధ్యక్షుడిగా గంగులు భాస్కర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గొడుగు చిన్న ఎల్లయ్యయాదవ్, కోశాధికారిగా లెంకట అజయ్‌యాదవ్, కార్యదర్శిగా సలేంద్రి రవియాదవ్ ఎన్నికయ్యారు.

కార్మికులకు లేబర్ కార్డు అందించాలి

వేములవాడ, మార్చి 1 : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ లేబర్ కార్డులు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు అన్నారు. శుక్రవారం సెంట్రింగ్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు లేబర్ కార్డులు అందించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. లేబర్ కార్డులు రెన్యువల్ చేసుకునేందుకు వెళ్తున్న కార్మికుల వద్ద అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ సంఘం అధ్యక్షుడు ఎల్లస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎల్ల రాజు, కోరెపు శ్రీనివాస్, డప్పు శ్రీనివాస్, దుమ్ము లక్ష్మణ్, శీలం రవి, లాల నర్సింగ్, వావిలాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరిగిపోతున్న సంపతేనె గుట్ట

- అక్రమంగా మొరం, మట్టి తరలింపు
- యథేచ్ఛగా దందా - ప్రభుత్వ ఆదాయానికి గండి


గుట్టపై మొరం తవ్వుతున్న ఎక్స్‌కావేటర్

చందుర్తి, మార్చి 1: అక్రమార్జనే ధ్యేయంగా కొందరు యంత్రాలతో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ప్రజాప్రతినిధుల అండతో అనుమతులు లేకుండానే గుట్టలను కరిగిస్తున్నారు. చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 145లోని ప్రభుత్వ స్థలంలో సుమారు 361 ఎకరాల విస్తీర్ణంలో సంపతేనె గుట్ట ఉంది. కొద్ది రోజులుగా గుట్ట నుంచి మొరాన్ని తవ్వుతున్నారు. ఎక్స్‌కావేటర్లు, టిప్పర్లతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. గతంలో రాత్రి పూట దందా చేసే వ్యాపారులు ఇప్పుడు పగటి పూటనే విచ్చలవిడిగా మొరాన్ని, మట్టిని తరలిస్తున్నారు. రహదారులు, ఇళ్ల నిర్మాణాలు, కొత్త వెంచర్ల ఏర్పాటు, మట్టి పనులు చేసేందుకు మొరం అవసరం ఒక్కో టిప్పరుకు రూ. 3000 ధర పలుకుతోంది. సంపతేనె గుట్ట నుంచి ప్రభుత్వానికి పైసా చెల్లించకుండానే తరలిస్తూ ఆదాయానికి గండి కొడుతున్నారు. రెవెన్యూ, గనుల శాఖల మధ్య సమన్వయ లోపంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. పర్యవేక్షణ బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ, రెండు శాఖల అధికారులు తప్పించుకుంటున్నారు.

నిబంధనలు బేఖాతరు

ప్రభుత్వ అభివృద్ధి పనులకు లేదా ప్రైవేటు పనులకు మట్టి అవసరమైతే సంబంధిత కాంట్రాక్టర్ స్థానిక అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఏ పని కోసం మట్టి అవసరముంది? రోజుకు ఎంత మొత్తం తరలిస్తారు? తదితర విషయాలను దరఖాస్తు పత్రంలో స్పష్టంగా పొందుపరచాలి. మట్టిని తరలించడానికి ఉపయోగించే వాహనాల వివరాలు, వాటి రిజిస్ట్రేషన్ నంబర్లను అధికారులకు సమర్పించాలి. అనుమతి పొందినా నిబంధనల మేరకే మట్టిని తరలించాలి. మట్టిని ఎంత మేరా తవ్వుతున్నారనే విషయాన్ని సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

దర్జాగా పంటల సాగు

మరోవైపు అక్రమార్కులు గుట్ట నుంచి మట్టిని తవ్వి తరలి స్తుండగా ఖాళీ అయిన స్థలాన్ని కొందరు ఆక్రమించి చదును చేసి సాగు చేస్తున్నారు. గతంలో సర్వే నంబర్ 145 లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు కొంత మందికి పట్టాలు చేసినట్లు అధికారులు తెలిపారు.


మొరం తరలింపు తర్వాత గుట్ట

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

- శ్రీనివాస్ తహసీల్దార్ చందుర్తి

ప్రభుత్వ భూముల నుంచి అనుమతి లేకుండా మొరం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేయడాన్ని పరిశీలిస్తాం. అక్రమాకులపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసును నమోదు చేయిస్తాం

ముదిరాజ్ యూత్ కార్యవర్గం

కోనరావుపేట, మార్చి 1 : కోనరావుపేట మండలం ధర్మారంలో ముదిరాజ్ యూత్ సంఘం కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నబోయిన అభిషేక్, ఉపాధ్యక్షుడిగా పడిగే అజయ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రం సతీష్, కార్యదర్శిగా శ్రీరాముల పర్శరాములు, క్యాషియర్‌గా పిట్టల ప్రశాంత్, సలహాదారుడిగా శ్రీరాముల అనిల్, కార్యవర్గ సభ్యులుగా విజయ్, సంజీవ్, శ్రీనివాస్, వెంకటేష్ ఎన్నికయ్యారు.

నేడు విజయ సంకల్ప యాత్ర ముగింపు సభ

వేములవాడ, మార్చి 1 : భారతీయ జనతా పార్టీ రాజరాజేశ్వరి క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర ముగింపు సభ శనివారం నాడు వేములవాడలో ఏర్పాటు చేశామని బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్, బిజెపి శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొనే ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జూనియర్ కళాశాలకు డెస్కుల వితరణ

ఇల్లంతకుంట, మార్చి 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ శుక్రవారం డెస్కులను వితరణ చేశారు. కళాశాలలో డెస్కుల కొరత ఉందని తెలుసుకొని రూ.10 వేలు కళాశాల అధ్యాపకులకు అందించారు. ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు, మాజీ ఉపసర్పంచ్ కుమార్, సీనియర్ నాయకుడు బాగయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి.. చందాలతో అంత్యక్రియలు

తంగళ్ళపల్లి, మార్చి 1: నిలువ నీడలేని ఓ పేద వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందగా పలువురు ముందుకొచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు వెంగల లక్ష్మి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలికి నిలువ నీడ లేకపోవడంతో గ్రామస్థులు మృతదేహాన్ని చెట్టు కింద వేసి దహన సంస్కారాలు జరిపించడానికి దాతల సహాయం కోసం ఎదురు చూశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలు సుకున్న తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ స్పందించి రూ.5 వేలు అం దించారు. దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. కురుమ సంఘం అధ్యక్షుడు ఎగుర్ల కర్ణాకర్, ఎర్ర రాజు ఫౌండేషన్లతో పాటు పలువురు వృద్ధురాలి అంత్యక్రియలకు సహాయం చేశారు.

20 నుంచి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 1: ధర్మపురి క్షేత్రంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు (జాతర) వైభవంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా యాత్రికుల సౌకర్యార్థం వివిధ శాఖల పక్డాన వసతుల ఏర్పాట్లు చేసేందుకు పాత టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 5న మంగళవారం ఉదయం 11 గంటలకు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

మల్యాల, మార్చి 1: హత్యాయత్నం కేసులో ఒకరికి ఏ డేళ్ల జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరిచింది. మండలంలోని మ్యాడంపల్లికి చెందిన పిట్టల సుదర్శన్‌ను సమీప బంధువు పిట్టల రవి 2020 జూన్ 4న కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటనపై సుదర్శన్ భార్య లక్ష్మి పోలీ సులకు ఫిర్యాదు చేసింది. తన భర్తతో రవి తరచూ గొడవ పడుతుండే వాడని చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై నాగరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కాగా శుక్రవారం జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి కె.ప్రసాద్ రవికి ఏడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.4వేల జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు.

షాదుల్లా బాబా దర్గాలో ఆది శ్రీనివాస్ మొక్కులు


మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే ఆది

కోనరావుపేట, మార్చి 1:పెద్దగుట్టలోని షాదుల్లా బాబా దర్గాలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం మొక్కులు చెల్లించుకున్నారు. కోనరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, బావుసాయిపేట ఎంపీటీసీ యాస్మిన్‌బాషా శాసనసభ ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిస్తే పెద్దగుట్టకు వస్తామని మొక్కారు. వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో కోనరావుపేట మండలం నుంచి పెద్దగుట్ట వరకు పాదయాత్ర చేసి గురువారం చేరుకున్నారు. శుక్రవారం మొక్కులు చెల్లించే కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. షాదుల్లా బాబాకు చాదర్ సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తాళ్లపల్లి ప్రభాకర్, చింతకుంట రామస్వామి, అబ్దుల్ రషీద్, పులి సత్యంతో పాటు కోనరావుపేట, చందుర్తి, వేములవాడ, కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

కేటీఆర్ రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలి


భూమిపూజ చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట, మార్చి 1: ఈ ప్రాంతంలో అభివృద్ధి చేసింది నిజమైతే మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని స్థానిక ఎంపీటీసీ రేణుక కృష్ణమూర్తితో కలిసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికే గతంలో ఎంపీగా పోటీ చేసి గెలిచిన సంగతి మరిచి పోయి కేటీఆర్ మాట్లాడుతున్నారన్నారు. ఎన్నో కుట్రలు చేసి గతంలో రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఓడిస్తే ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా గెలిచారన్నారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ నాయకులు ఈ రోజు మేడిగడ్డను ఏ విధంగా చేశారో అందరికీ తెలుసన్నారు. 9వ ప్యాకేజీ పూర్తయితే ఈ రోజు అప్పర్ మానేరు డ్యాం నీటితో కళకళలాడేదని, ఈ ప్రాంతం సస్యశ్యామలమయ్యేదని అన్నారు. కాసులకు కక్కుర్తి పడిన కేటీఆర్ ఇక్కడ అవినీతి పాలన కొనసాగించారన్నారు. సిరిసిల్ల పట్టణంలో బతుకమ్మ చీరల పేరిట నేతన్నలకు 2 ఏళ్లుగా రూ.250 కోట్లు బకాయి పడ్డ విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. కేవలం లాబపడ్డది ఎవరంటే ఇసుక మాఫియా, భూ మాఫియా, మందు మాఫియా, గంజాయి మాఫియా మాత్రమే అన్నారు. కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని, మతిభ్రమించి మాట్లాడితే కొద్ది రోజుల్లో ఎర్రగడ్డ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు రేణుక కృష్ణమూర్తి, పర్శరాములు, నాయకులు ప్రభాకర్, రాజు, విఠల్ తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బండలింగంపల్లి, సింగారంలో ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావు పలు అభివృద్ధి పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కొత్తపల్లి పద్మ, సింగారపు మధు, మాజీ సర్పంచులు మల్లేశం, నర్సాగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన పలువురు కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

ఇల్లంతకుంట, మార్చి 1: మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని, లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డి అన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేనందున రెవన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు అర్హులైన వారికి పంపిణీ చేస్తామన్నారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణాలు పూర్తయి కొంతకాలమైందని, దీంతో చిన్నచిన్న మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జావెద్ అహమ్మద్, డీటీ సత్యనారాయణ, ఆర్ఐ షఫీ, సర్వేయర్ భాస్కర్‌రెడ్డి, మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

చందుర్తి, మార్చి 1: దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం భవనం వద్ద జడ్ నిధులతో చేపట్టిన బోరుకు శుక్రవారం భూమి పూజ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎంపీటీసీ పులి రేణుక-సత్యయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామస్వామి, నాయకులు గొట్టే ప్రభాకర్ కనకరాజు, బాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు భూమి పూజ

తంగళ్లపల్లి, మార్చి 1: తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చపేట అంకిరెడ్డి పల్లె, మండపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమాలలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు నీరటి బాబు, పొన్నాల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గంభీరావుపేట, మార్చి 1: మెగా డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో గంభీరావుపేట మండలానికి చెందిన నిరుద్యోగులు శుక్రవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపాగారి రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి మైనారిటీ జిల్లా కార్యదర్శి తాజుద్దీన్ కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు మెడ భాస్కర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మేడ రమ, నిరుద్యోగులు వెంకటేష్, రాజు, శ్రీకాంత్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ వార్డు సభ్యులు

సిరిసిల్ల టౌన్, మార్చి 1: సిరిసిల్ల పట్టణం శివనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ జిల్లా మీడియా ఇన్‌చార్జి గడ్డం మధుకర్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ మాజీ వార్డు మెంబర్లు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఇందిరమ్మ కాలనీ వార్డు మాజీ మెంబర్లు దూస మహేందర్, సామల సరస్వతి - సత్యనారాయణ, కారంపూరి కమల చేరారు. తంగళ్లపల్లి జడ్పీటీసీ పూర్మాని మంజూల లింగరెడ్డి, మండల అధ్యక్షుడు జలగం ప్రవీన్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, గోరింటల రాజమల్లు, భాగ్యలక్ష్మి, మహిళ మండల అధ్యక్షురాలు హారిక పాల్గొన్నారు.

మాదిగ అమర వీరులకు ఘన నివాళి

సిరిసిల్ల టౌన్, మార్చి 1: సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం మాదిగ అమరవీరులకు మహాజన్ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారన్నారు. పోరాటంలో అసువులు బాసిన అమరులకు జోహర్లు అర్పించినట్లు చెప్పారు. వారి పోరాటాలు వృథా కాలేదని త్వరలో ఏబీసీడీ వర్గీకరణ సాధించుకోబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, నాయకులు జాన్సన్, శంకర్, రాజు, హరీష్, సాయి పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ముస్తాబాద్, మార్చి 1 :ముస్తాబాద్ మండలం కేంద్రంలోని పులిచేరుకుంట మైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్యను సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, బండారి సత్తయ్య, బండారి శేఖర్, పుల్లూరి రవి పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి బాటలు వేసిన కేటీఆర్


మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్, బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 1: జిల్లాలోని పేదింటి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారంటే ఆ ఘనత మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఘనతేనని అభివృద్ధికి బాటలు వేసిన కేటీఆర్‌ను సన్నాసి అని సంబోధించడం సరికాదని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్‌ను కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి దూషించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పడి బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక సిరిసిల్ల రూపురేఖలను కేటీఆర్ మార్చి వేశారన్నారు. సిరిసిల్ల అభివృద్ధి ప్రజలకు కళ్లకు కొట్టొచ్చినట్లు కనబడుతోందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాను మరింత అభివృద్ధి చేసి చూపించాలన్నారు. రాజకీయ విలువలను గౌరవించి మాట్లాడాలన్నారు.

కేటీఆర్‌ను విమర్శిస్తే ప్రజలు సహించరు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌పై మహేందర్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మరోసారి మాట్లాడితే ప్రజలు సహించరని, నాలుక కోస్తారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. సిరిసిల్ల ప్రజల అభ్యున్నతికి కేటీఆర్ పనిచేశారని, చిన్నపిల్లాడి నుంచి పండు వృద్ధుడైన చెబుతారని అన్నారు. శని, ఆదివారం వచ్చే మహేందర్‌రెడ్డి నాలుగుసార్లు పోటీ చేస్తే ప్రజలు ఒక్కసారైనా గెలిపించేవారని అన్నారు. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన బీడీ కార్మికులు, ఇళ్లు లేని నిరుపేదలు, రైతన్నల కోసం, సబ్‌స్టేషన్ల కోసం కొట్లాడినావా? అని ప్రశ్నించారు. నేతన్నల బతుకులు నిలబెట్టడం కోసం కోట్లది రూపాయాల ప్యాకేజీలను తీసుకొచ్చిన కేటీఆర్‌ను ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమన్నారు. గల్ఫ్ జైల్లో నుంచి ఇండియాకు వచ్చిన పెద్దూర్‌కు చెందిన మల్లేశం, రవిను అడిగితే తెలుస్తుందన్నారు. 9వ ప్యాకేజీ మల్కపేట రిజర్వాయర్ ట్రయల్‌రన్ పూర్తి చేశామని, కేవలం పిల్లకాలువలు పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. ఏనుగు వెళ్లి కేవలం తోక మిగిలిందని, ఆ తోకను పట్టుకొని పెద్దగా చేసి చూపిస్తున్నారని ఆరోపించారు. నీతిగల కాంగ్రెస్ ప్రభుత్వమైతే వాస్తవిక పరిస్థితులను చెప్పాలనుకుంటే మీడియా సమావేశం ఏర్పాటు చేసి పవర్ ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. మల్కపేట రిజర్వాయర్ పూర్తి చేశామా లేదా అన్నది మీడియా మిత్రులు రైతులకు, ప్రజలకు చెబుతారన్నారు. నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో కేటీఆర్ అభివృద్ధి చేశారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన కొసరు పనులను మాత్రమే చేయాల్సి ఉందని అన్నారు. కేవలం ఐదు కోట్లు నియోజకవర్గానికి తీసుకొచ్చి కాంగ్రెస్‌లో చేరినోళ్లంతా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమన్నారు. రాబోయే రోజుల్లో మహేందర్‌రెడ్డిని ప్రజలు తరిమికొడతారన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మున్సిపల్ అభివృద్ధికి మంత్రి కేటీఆర్ రూ. 40 కోట్లు మంజూరు చేయగా 254 పనులను గుర్తించి కేవలం 60 రోజులలో టెండర్లు పిలిచామన్నారు. అందులో 6వ వార్డు అభివృద్ధికి రూ.55 లక్షలు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు కూడా కేటాయించామన్నారు. విలీన గ్రామాలకు రూ. 16కోట్లు, పట్టణంలో రూ. 22 కోట్లు, జంక్షన్స్ అభివృద్ధికి రూ. 2 కోట్లు కేటాయించామన్నారు. రూ. 40 కోట్లు పట్టణ అభివృద్ధి కోసం వచ్చాయని కేటీఆర్, చక్రపాణి ఇంటికి వస్తలేవన్న జ్ఞానం కాంగ్రెస్ నాయకులకు లేకుండా పోయిందని ఆరోపించారు. రూ.40 కోట్ల టెండర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపిందన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, పట్టణ ఉపాధ్యక్షుడు సత్తార్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మాజీ కౌన్సిలర్లు గుండ్లపెల్లి పూర్ణచందర్, దార్ల సందీప్, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, మల్లారెడ్డి, సికిందర్, మనోజ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

పదేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మార్చి 1: తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేటీఆర్ దోచుకొని దాసుకోవడం తప్పా ప్రజలకు చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేడిగడ్డ సందర్శనకు వెళ్లే ముందు రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి ఎలా దాచుకున్నారో ప్రజలకు చెప్పాల్సిందన్నారు. అవినీతికి పాల్పడ్డారు కాబట్టే మేడిగడ్డకు వెళ్తుంటే బస్సు పంచర్ అయ్యిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపైన అసెంబ్లీలో చర్చిద్దాం రమ్మంటే ప్రజాప్రతినిధిగా ఎన్నికైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చట్టసభలపై గౌరవం లేకండా ప్రవర్తించిన తీరును ప్రజలు గ్రహించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిజాయితీ ఉంటే, రీడిజైనింగ్‌పై అక్రమాలకు పాల్పడకుంటే అసెంబ్లీలో కూర్చుండి చర్చలో పాల్గొని ఉంటే బాగుండేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే అవినీతి, అక్రమాలు జరగలేదని చెప్పడానికైన అసెంబ్లీలో చర్చలో కేసీఆర్ పాల్గొనేవారన్నారు. ఒక వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కృష్ణ రివర్‌వాటర్‌పైన రాద్ధాంతం చేశారని ఆరోపించారు. ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌తో కేసీఆర్ భోజనం చేసి కృష్ణ వాటర్‌ను ధారదత్తం చేసి మన చేండ్లను ఎండబెడుతున్నారని రికార్డులే చెపుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి కృష్ణ నదిని తీసుకొచ్చింది మీరు కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్కడ కట్టవద్దని నిపుణులు చెప్పినా వినకుండా కట్టారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డ సందర్శనకు ఎమ్మెల్యేలందరూ రావాలని ఆహ్వానించారని, అక్కడికి వెళ్లడానికి కేటీఆర్‌కు ఎందుకు మనస్సు ఒప్పలేదో చెప్పాలని అన్నారు. అసెంబ్లీకి రావడానికి కేసీఆర్‌కు కాలు అడ్డం వచ్చిందని, నల్లగొండలో అబద్ధాలు చెప్పడాకి వెళ్లారని అన్నారు. 2019లోనే మేడిగడ్డకు పగుళ్లు వచ్చాయని ఇంజనీర్లు చెప్పినా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల రాజకీయం కోసం ప్రజలు మళ్లీ ఎక్కడ బొంద పెడుతారోనన్న భయంతో ఇటువంటి యాత్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంటలను ఎండబెట్టవద్దని మల్లన్న సాగర్ నుంచి రెండు టీఎంసీల నీళ్లను తీసుకొచ్చిందన్నారు. పదేళ్లుగా కేటీఆర్ సిరిసిల్ల ప్రాంతాన్ని దోచుకోవడం తన మందిమారాజులకు దోచిపెట్టడానికే సరిపోయిందన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. సిరిసిల్ల పద్మశాలీలు బతుకమ్మ చీరలు నేస్తే వారి బకాయిలు మరిచిపోయారన్నారు. బంగారు తెలంగాణలో వారి భవిష్యత్ ఎందుకు నాశనం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ కొందరు నాయకులతో అనవసరంగా మాట్లాడిస్తున్నారని, ఈ ప్రాంతానికి 9,10,11 ప్యాకేజీల నుంచి వచ్చే కాలువలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ జీరో అవర్స్‌లో పద్మశాలీల బతుకమ్మ బకాయిల గురించి ఎందుకు అడగలేదన్నారు. మల్కపేట రిజర్వాయిర్‌ను పూర్తి చేశామని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు మల్కపేట రిజర్వాయిర్‌లో ట్రయల్‌రన్‌తో కేవలం ఒక్క టీఎంసీ నీరు నింపి ఓట్లు దండుకోవాలని చూశారని ఆరోపించారు. మల్కపేట రిజర్వాయిర్ నీళ్ల ఎటు వెళ్తున్నాయో చూపగలుగుతారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, నాయకులు వైద్య శివప్రసాద్, కోడం శ్రీనివాస్, ఎండీ ఖాజా, బూట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.